క్లుప్తంగా

మారెమ్మ అమ్మవారిని దర్శించుకున్న జడ్జి మోతీలాల్



పుట్రేల (విస్సన్నపేట): మండలంలోని పుట్రేల గ్రామంలో ఉన్న మారెమ్మ అమ్మవారిని తిరువూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.మోతీలాల్ దంపతులు ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ కోటగిరి వెంకట సత్యశేష సునీల్ కుమార్, ఈఓ ఆర్.వెంకటేశ్వరరావు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి దంపతులను సన్మానించి, అమ్మవారి ప్రతిమ, ప్రసాదాలను అందజేశారు. కాగా అమ్మవారిని శాకాంబరీదేవిగా అలంకరించి, భక్తులకు దర్శభాగ్యం కల్పించినట్లు ఈఓ తెలిపారు.

నేడు గడప గడపకు మనప్రభుత్వం

తోటమూల(గంపలగూడెం): గంపలగూడెం మండలం పెద్దకొమిర సచివాలయం పరిధిలోని తోటమూలలో సోమవారం గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి తెలిపారు. ఉదయం ఏడు గంటల నుంచి నిర్వహించే కార్యక్రమంలో తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణనిధి పాల్గొని అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరావు కోరారు.

మౌన సత్యాగ్రహ దీక్ష విజయవంతం చేయండి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): బీజేపీ నాయకులు రాహుల్‌గాంధీపై తప్పుడు కేసులు బనాయించి వేధిస్తున్న నేపథ్యంలో పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు పిలుపు మేరకు ఈ నెల 12వ తేదీన విజయవాడలో తలపెట్టిన మౌన సత్యాగ్రహ దీక్ష విజయవంతం చేయాలని పీసీసీ కార్యదర్శి పోతురాజు ఏసుదాసు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ దీక్షకు ఏఐసీసీ కార్యదర్శి కిష్టాపూర్ తిలక్ మయ్యప్పన్ హాజరవుతారని పేర్కొన్నారు.

హిందీ పరీక్షలకు దరఖాస్తు చేసుకోండి

తిరువూరు: దక్షిణభారత హిందీ ప్రచార సభ సెప్టెంబరులో నిర్వహించనున్న వార్షిక పరీక్షలకు హాజరు కాగోరే విద్యార్థులు ఈ నెల 15వ తేదీ లోపు ఫీజు చెల్లించాలని ప్రథమశ్రేణి ప్రచారక్ రఘునందన్ తెలిపారు. సెప్టెంబరు 9, 10 తేదీల్లో నిర్వహించే ప్రాథమిక, మధ్యమ, రాష్ట్ర, ప్రవేశిక, విశారద, ప్రవీణ పరీక్షలకు ఫీజు చెల్లించదలచిన వారు 94408 48924లో సంప్రదించాలని పేర్కొన్నారు. అపరాధ రుసుంతో ఈ నెల 25వ తేదీ వరకు అవకాశం ఉందని తెలిపారు.

నేడు 'స్పందన'

గంపలగూడెం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించే కార్యక్రమాల్లో మండల పరిధిలోని వివిధ శాఖల అధికారులు పాల్గొంటారని, ప్రజలు తమ సమస్యలపై దరఖాస్తులు ఇవ్వవచ్చని పేర్కొన్నారు.

నేటి నుంచి రైతుబజారులో టమాటా విక్రయాలు

నూజివీడు: స్థానిక రైతుబజారులో సోమవారం నుంచి రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై టమాటాలు కిలో రూ.50కు విక్రయించనున్నట్లు ఎస్టేట్ అధికారి కొలుసు పుష్పవల్లి తెలిపారు. టమాటా ధరలు బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.100కు విక్రయిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వచ్చి ప్రజలకు రాయితీపై అందజేస్తోందని పేర్కొన్నారు. ఒక వ్యక్తికి ఒక కిలో మాత్రమే విక్రయించనున్నట్లు తెలిపారు., కావాల్సిన వారు ఆధార్‌కార్డు, రేషన్ కార్డు తీసుకుని ఉదయం తొమ్మిది గంటలకు రావాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

రాంప్రదీప్ సేవలు అభినందనీయం

తిరువూరు: తెలుగు, ఆంగ్లంలో విద్యార్థులకు ఉపయోగకరమైన రచనలు చేస్తున్న ఆంగ్ల భాషోపాధ్యాయ సంఘం కన్వీనర్ ఎం.రాంప్రదీప్ సేవలు అభినందనీయమని తిరువూరు జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. తెలుగు భాషా వికాసానికి రాంప్రదీప్ చేస్తున్న కృషిని గుర్తించి, రాష్ట్ర తెలుగు అధ్యాపకుల సంఘం జారీచేసిన ప్రశంసాపత్రాన్ని ఆదివారం రామచంద్రారెడ్డి చేతుల మీదుగా అందజేశారు. విద్యార్థులకు ఉపయుక్తమైన రీతిలో బోధన అందించడం రాంప్రదీప్ ప్రత్యేకతని కూడా జెడ్పీటీసీ సభ్యుడు అభినందించారు.

నేడు జగనన్న సురక్ష

నూజివీడు: పోతురెడ్డిపల్లిలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వీపీ విజయ్‌కుమార్ ఆదివారం తెలిపారు. గ్రామ సచివాలయం వద్ద ఉదయం 9.30 గంటల నుంచి నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లను అందజేయడంతో పాటు అర్హులు ఎవరైనా తమకు ఏదైనా పథకం రాకపోతే అర్జీని అందజేయవచ్చని పేర్కొన్నారు.

'నాడు-నేడు'తో మారిన రూపురేఖలు

నాడు



అభివృద్ధికి ముందు రాజవరం పాఠశాల

నేడు



'నాడు-నేడు'తో చక్కని రూపురేఖలు సంతరించుకున్న గంపలగూడెం మండలం రాజవరం పాఠశాల



పాఠశాలలో తాగునీటి వసతి



పాఠశాలలో మరుగుదొడ్లు

గంపలగూడెం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాడు-నేడు పథకంతో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో రూపురేఖలు మారిపోయాయి. ఇప్పటికే రెండు విడతలుగా నాడు-నేడు పథకాన్ని ప్రభుత్వం అమలు చేసింది. మొదటి విడత పాఠశాలల్లో పనులు పూర్తి కాగా రెండో విడత పాఠశాలల్లో పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. ఈ పథకం కింద ఎంపికైన పాఠశాలల్లో ప్రధానంగా విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టారు. వీటితోపాటు విద్యార్థులకు అవసరమైన 11 రకాల అభివృద్ధి పనులను(కాంపోనెంట్స్) చేపట్టడం జరుగుతుంది. ఎంపికైన ప్రతి పాఠశాలలో నీటి వసతితో కూడిన మరుగుదొడ్లు, తాగునీటి వసతి, మేజర్, మైనర్‌వర్కులు, ప్రహరీ గోడ, గ్రీన్‌బోర్డు, గ్రీనరీ, విద్యుదీకరణ, ఇంగ్లిష్ ల్యాబ్, టీచర్, స్టూడెంట్ ఫర్నీచర్, వంటగది నిర్మాణ తదితర పనులు చేపట్టారు. మేజర్ మైనర్ పనులకుగాను ఫ్లోరింగ్, గోడలను అభివృద్ధి పరుస్తూ ప్లాస్టింగ్, ఫ్లోరింగ్, టైల్స్ ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్‌కు దీటుగా మారుతున్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ముందు ప్రభుత్వ పాఠశాలల్లో సరైన వసతులు లేక కొట్టుమిట్టాడాయి. విద్యార్థులు తాగునీటికి, మలమూత్ర విసర్జనకు ఇబ్బందులు పడేవారు. సరైన గాలి, వెలుతురు లేకపోవడం, కూర్చొనేందుకు కావల్సినన్ని బెంచీలు, బల్లలు లేక తంటాలు పడాల్సి వచ్చేది. బోర్డులు సైతం అంతంత మాత్రంగానే ఉండేవి. ప్రహరీ గోడలు లేక పడే ఇబ్బందులు చెప్పనలవి కాకుండా ఉండేవి. ఉపాధ్యాయులకు సైతం డెస్కులు, కుర్చీలు లేని రోజుల నుంచి ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్‌కు దీటుగా నాడు-నేడు పథకంతో మారుతున్నాయి. దీంతో విద్యార్థులను, తల్లిదండ్రులను ప్రభుత్వ పాఠశాలలు ఆకర్షిస్తున్నాయి.

రెండు ఫేజుల్లో అభివృద్ధి చెందిన పాఠశాలలు: 61

మండలానికి ఖర్చు చేసినది: రూ.17.16 కోట్లు

పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి అంశాలు: 11

రెండు విడతల్లో 61 పాఠశాలల అభివృద్ధి

గంపలగూడెం మండలంలో రెండు విడతల్లో 61 పాఠశాలల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.17.16 కోట్లు మంజూరు చేసింది. మొదటి విడత రూ.4.94 కోట్లతో 26 పాఠశాల్లో అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. ఫేజ్-2లో 35 పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి రూ.12.22 కోట్లు విడుదలయ్యాయి.

ఫేజ్-1లో అభివృద్ధి జరిగిన పాఠశాలలు

ఏపీ మోడల్ స్కూల్, కేజీబీవీ బాలికల విద్యాలయం, ఎంపీపీఎస్‌లు-18, యూపీలు-5, పెనుగొలను హైస్కూల్‌ను అభివృద్ధి పరచారు.

ఫేజ్-2లో అభివృద్ధి చేస్తున్న పాఠశాలలు

ఎంపికైన పాఠశాలలు 31, అంగన్‌వాడీ కేంద్రాలు 4. మంజూరైన నిధులు రూ.12.22 కోట్లు. వీటిలో జెడ్పీ ఉన్నత పాఠశాలలు 9, ప్రాథమికోన్నత పాఠశాలలు 3, ఎలిమెంటరీ పాఠశాలలు 19, అంగన్‌వాడీ కేంద్రాలు నాలుగింటిని అభివృద్ధి పరుస్తున్నారు. ఆయా భవనాల్లో 11 కాంపోనెంట్స్‌లో అభివృద్ధి చేయడం జరుగుతుంది. వీటిలో 14 పాఠశాలల్లో కావాల్సిన 41 అదనపు తరగతి గదులు నిర్మిస్తున్నారు. ఆయా విద్యాలయాల్లో 11 కాంపోనెంట్స్ ఏర్పాటుకు రూ. 6.69కోట్లు, అదనపు తరగతుల నిర్మాణానికి రూ. 5.53 కోట్లు మంజూరు చేశారు. సంబంధిత పాఠశాలల్లో అభివృద్ధి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

చదువుకునేందుకు చక్కని వాతావరణం



నాడు-నేడు పథకంతో పాఠశాల అభివృద్ధితోపాటు చదువుకునేందుకు చక్కని వాతావరణం ఏర్పడింది. విద్యుదీకరణతో గాలి, వెలుతురు సోకుతుంది. ఫ్లోరింగ్, ప్లాస్టింగ్, టైల్స్ ఏర్పాటుతో చూసేందుకు పాఠశాలలు చాలా బాగున్నాయి.

– షేక్ మహ్మద్, 7వ తరగతి, లింగాల యూపీ, గంపలగూడెం మండలం

సకల వసతులు ఏర్పాటు



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కావాల్సిన వసతులను ఏర్పాటు చేస్తున్నారు. ప్రధానంగా ఫర్నీచర్, నీటి వసతితో మరుగుదొడ్లు, తాగునీటి వసతి, ఏర్పాటుతో ఎంతో సౌకర్యవంతంగా ఉంది.

– మౌనిక, 8వ తరగతి, గోసవీడు యూపీ, గంపలగూడెం మండలం

లారీలను అడ్డుకున్న గ్రామస్తులు

జి.కొండూరు: మండలంలోని గడ్డమణుగులో కంకర లోడుతో వెళుతున్న లారీలను గ్రామస్తులు ఆదివారం సాయంత్రం నిలిపివేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ భారీ వాహనాలు పరిమితికి మించిన లోడుతో రాకపోకలు సాగించడంతో రహదారి మొత్తం గుంతలు ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతే కాకుండా ఓవర్‌లోడు కారణంగా కంకర రహదారిపై పడి, ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని మండిపడ్డారు. భారీ వాహనాలు రాకపోకలు సాగించేందుకు ప్రత్యామ్నాయ మార్గం ఉన్నప్పటికీ ప్రయాణదూరాన్ని తగ్గించుకునేందుకు గ్రామంలో నుంచి వెళ్లడం దుర్మార్గమన్నారు. అధికారులు వెంటనే స్పందించి వాహనాలను దారి మళ్లించాలని కోరారు.

పేద విద్యార్థినికి ఆర్థిక సాయం



తిరువూరు: ఒక పేద విద్యార్థిని మెడిసిన్ విద్య కొనసాగింపునకు అవసరమైన ఆర్థిక సాయాన్ని తిరువూరుకు చెందిన వ్యాపారి వేమూరి కనకదుర్గాప్రసాద్ ఆదివారం అందజేశారు. ఖమ్మం జిల్లా కల్లూరు మండలం రఘునాథబంజరుకు చెందిన జానపాటి సుష్మ ఎంబీబీఎస్ ప్రథమ సంవత్సరంలో ఉత్తమ మార్కులు సాధించి రెండో సంవత్సరం చదువునకు ఫీజు చెల్లించాల్సి ఉండగా, ఆమె కుటుంబసభ్యుల ఆర్థిక పరిస్థితి గమనించిన తిరువూరు నియోజకవర్గ యాదవ సంక్షేమ సంఘ ఉపాధ్యక్షుడు కందుల విజయకుమార్ దాతల సాయం కోసం ప్రయత్నించారు. కనకదుర్గాప్రసాద్ రూ.10వేలు సుష్మ తల్లిదండ్రులకు ఆర్థికసాయాన్ని అందించినట్లు విజయకుమార్ తెలిపారు.

టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా షేక్ బాషా



విలియమ్స్ హువే చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న అధ్యక్షుడు బాషా

భవానీపురం(విజయవాడపశ్చిమ): నవ్యాంధ్ర విజయవాడ టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గొల్లపూడి అధ్యక్షుడిగా గొల్లపూడికి చెందిన షేక్ బాషా ఎన్నికయ్యారు. టైలరింగ్ సృష్టికర్త జర్మనీకి చెందిన విలియమ్స్ హువే 204వ జయంతిని పురస్కరించుకుని ఆదివారం గొల్లపూడిలో అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. తొలుత విలియమ్స్ హువే చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుని అసోసియేషన్ సిటీ అధ్యక్షుడు జేడీ కల్యాణ్ వారి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా గొల్లపూడి అధ్యక్షుడిగా ఎన్నికైన షేక్ బాషాకు ఆయన నియామక పత్రాన్ని అందచేశారు. విజయవాడ విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్ నుంచి రూరల్ మండలం గుంటుపల్లి వరకు గల టైలర్స్ తమకు ఎదురయ్యే సమస్యలను అసోసియేషన్ దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు బంగారు రాజు, శ్రీను, రామలక్ష్మి, ముస్తఫా, సాల్మన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ మండల ప్రధాన కార్యదర్శిగా అబీబుల్లా

రెడ్డిగూడెం: ఇటీవల జరిగిన ఉపాధ్యాయ బదిలీలలో ఎస్టీయూ మండల ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన డి.కృష్ణ చాట్రాయి మండలానికి బదిలీ కావడంతో ఆ ఖాళీని భర్తీ చేసేందుకు ఆ సంఘ సభ్యులు జూమ్ మీటింగ్ ద్వారా ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండలంలోని రాఘవాపురం జిజి పాఠశాలలో పని చేస్తున్న ఎస్‌కే అబీబుల్లాని ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.అనుగ్రహ ప్రసాద్, మండల అధ్యక్షుడు బి.అనిల్‌కుమార్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నూజివీడు: పట్టణంలోని పలు ప్రాంతాల్లో 11 కేవీ విద్యుత్ తీగల కింద ఉన్న చెట్లను తొలగించేందుకు సోమవారం విద్యుత్ సరఫరాను ఉదయం ఏడు నుంచి 10 గంటల వరకు నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ పట్టణ డీఈ ఓలేటి దుర్గారావు ఆదివారం తెలిపారు. హనుమాన్‌జంక్షన్ రోడ్డు, ద్వారకాసెంటర్, చిన్నగాంధీబొమ్మ సెంటర్, పొట్టిశ్రీరాములు బొమ్మ సెంటర్, పెద్దగాంధీబొమ్మ సెంటర్, పీజీ సెంటర్, బ్యాంక్ స్ట్రీట్, కోనేరుపేట తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, ప్రజలు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పాముకాటుకు గురై యువకుడు మృతి

విస్సన్నపేట: మండలంలోని తెల్లదేవరపల్లిలో జామాయిల్ తోటలో పనిచేస్తున్న బీహార్‌కు చెందిన కార్మికుడు అజయ్‌కుమార్ (19) ఆదివారం తెల్లవారుజామున పాముకాటుకు గురై చికిత్సపొందుతూ మృతి చెందాడు. పాముకాటుకు గురికాగానే తెల్లదేవరపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం 108లో నూజివీడు ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్సపొందూ అజయ్‌కుమార్ మృతి చెందాడు. మృతుడి బంధువు చందన్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

తారురోడ్డు నిర్మాణ పనులు పూర్తి

- రూ. 3.63కోట్లతో బోర్వంచ నుంచి యనమదల వరకు రోడ్డు
- ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు కృషి



నూజివీడు మండలం బోర్వంచ నుంచి యనమదల వరకు నిర్మించిన తారురోడ్డు

నూజివీడు: మండలంలోని బోర్వంచ నుంచి నెహ్రూనగర్, రేగుంట మీదుగా యనమదల వరకు దాదాపు ఆరు కిలోమీటర్ల పొడవునా తారురోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. దీంతో ఆయ గ్రామాల ప్రజల చిరకాల వాంఛ అయిన తారు రోడ్డు సదుపాయం ఎట్టకేలకు నెరవేరింది. ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు కృషితో పీఎంజీఎస్వై కింద రూ.3.63 కోట్లు మంజూరు కాగా ఆ నిధులతో తారు రోడ్డు నిర్మాణ పనులను చేపట్టారు. బోర్వంచ వద్ద నుంచి అమృతనగర్, రేగుంట మీదుగా యనమదల వరకు ఈ రోడ్డు నిర్మాణం జరుగుతోంది. చాలా కాలంగా రహదారిని నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నప్పటికీ గతంలో పాలించిన ప్రభుత్వాలు ఇవేమీ పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడి ప్రతిపాదనలు పంపించి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యేలా కృషి చేశారు. దీంతో పంచాయతీరాజ్ అధికారులు రోడ్డు నిర్మాణ పనులు పర్యవేక్షిస్తున్నారు. లింకురోడ్ల నిర్మాణం వల్ల గ్రామాలు సైతం అభివృద్ధి పథంలో పయనించనున్నాయి.

ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు కృషితో రోడ్డు సాధ్యం



ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు కృషి వల్లనే ఈ రోడ్డు నిర్మాణం సాధ్యమైంది. బోర్వంచ నుంచి యనమదల వరకు తారు రోడ్డు నిర్మాణం ఈ ప్రాంత ప్రజలకు వరం. మామిడి కాయలు తోటల్లో నుంచి తెచ్చుకునేందుకు ఎంతో సులువవుతుంది. బోర్వంచ, అమృతనగర్, రేగుంట, యనమదల గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు చేసిన మేలును ఎన్నటికీ మరిచిపోరు.

– గుడిమళ్ల కృష్ణంరాజు, జెడ్పీ వైస్ చైర్మన్, రేగుంట

ఆనందంగా ఉంది



రేగుంటకు తారురోడ్డు సదుపాయం కలగడం ఎంతో ఆనందంగా ఉంది. ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు తారురోడ్డు నిర్మాణానికి చేసిన కృషిని గ్రామస్తులు ఎన్నటికి మరిచిపోరు. గ్రామంలోని ప్రతి ఒక్కరూ హర్షం వ్యక్తం చేయడమే కాకుండా తమ చిరకాల వాంఛ నెరవేర్చినందుకు ఎమ్మెల్యే ప్రతాప్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

– శీదర్ల శాంతకుమార్, రేగుంట

పంగిడమ్మ తల్లికి పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే ప్రతాప్



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

ఆగిరిపల్లి (నూజివీడు): ఆగిరిపల్లి మండలంలోని కొత్త ఈదరలో వేంచేసియున్న పంగిడమ్మ తల్లి అమ్మవారి బోనాల జాతర కార్యక్రమాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి ఎమ్మెల్యే ప్రతాప్ పట్టువస్త్రాలను సమర్పించారు. కార్యక్రమంలో సీతారామపురం సర్పంచ్ అత్తి మురళీమోహన్‌రావు, పెరిక కార్పొరేషన్ డైరెక్టర్ అత్తి పార్వతి, మాజీ సర్పంచ్ సత్యనారాయణ, నాయకులు కృష్ణారావు, ప్రసాద్‌వర్మ పాల్గొన్నారు.

నాడు-నేడు పనులు ప్రారంభం



శ్లాబ్ పనులు పరిశీలిస్తున్న అధికారులు

చాట్రాయి: మండలంలోని చనుబండ హైస్కూల్లో నాడు-నేడు పథకంలో చేపట్టిన పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా రూ.39 లక్షలతో చేపట్టిన మూడు తరగతి గదులకు ఆదివారం శ్లాబ్ పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈ సీహెచ్ భాస్కరరెడ్డి, ఏఈ సత్యప్రసాద్, ఎంఈఓ బ్రహ్మచారి, హైస్కూలు హెచ్ఎం సత్యనారాయణ పాల్గొన్నారు.

కనకదుర్గమ్మకు సారె సమర్పణ



త్రిలోచనాపురం నుంచి కనకదుర్గమ్మకు సారె సమర్పించేందుకు వెళుతున్న మహిళలు

త్రిలోచనాపురం(ఇబ్రహీంపట్నం): మండలంలోని త్రిలోచనాపురం నుంచి విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారికి పలువురు మహిళా భక్తులు భక్తి శ్రద్ధలతో సారె సమర్పించారు. గ్రామానికి చెందిన శ్రీవిశ్వగాయత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 80మంది మహిళలు, మహిళా కోలాట దళం సభ్యులు, 10మంది పురుషులు పసుపు, కుంకుమ, పూలు, చీర, జాకెట్, గాజులు, వివిధ రకాల పండ్లు తదితరాలు తలపై పెట్టుకుని కాలినడకన విజయవాడ చేరుకున్నారు. అక్కడ అమ్మవారికి పూజలు చేసి సారె సమర్పించారు. మండల హిందూ ధర్మ ప్రచారక్ చెవులు గోపాలరావు, మండల కన్వీనర్ ఆళ్ల సూరిబాబుపాల్గొన్నారు.

గంపలగూడెం నుంచి..

గంపలగూడెం: ఆషాఢ మాసం సందర్భంగా గంపలగూడేనికి చెందిన మహిళలు ఆదివారం విజయవాడ కనకదుర్గమ్మకు సారె సమర్పించారు. సారెతో పాటు పూజకు వినియోగించేందుకు 125 గ్రాముల వెండి గిన్నెను అందజేశారు.

మైనార్టీల పక్షపాతి సీఎం వైఎస్ జగన్



నురాని మసీదు వద్ద ముస్లింలతో మొహమూద్

భవానీపురం(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో పేదరికంలో ఉన్న ముస్లిం మైనార్టీ కుటుంబాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ కార్యక్రమాల ద్వారా ఆదుకుంటూ మైనార్టీల పక్షపాతిగా నిలిచారని వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎండీ మొహమూద్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ సంక్షేమ పథకాల ప్రచార కార్యక్రమం 'హర్ దిల్ మే వైఎస్సార్ – హమ్ సబ్ సాత్ జగన్‌కే సాత్'లో భాగంగా ఆయన ఆదివారం మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ సూచనల మేరకు ఇబ్రహీంపట్నం మండలం దాములూరులోగల నురాని మసీదును సందర్శించి జహర్ నమాజ్ ఆచరించారు. అనంతరం మొహమూద్ మసీదు ప్రాంగణంలో స్థానిక ముస్లిం మత పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హజ్ యాత్రికులకు సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం చేస్తున్న కృషి, చొరవ చరిత్రలో నిలిచి పోతుందన్నారు.

రైఫిల్ షూటింగ్‌లో మనోజ్‌కు సిల్వర్‌మెడల్



విజయవాడలో సిల్వర్ మెడల్ అందుకున్న మనోజ్

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలో ఈటీపీఆర్‌గా విధులు నిర్వహిస్తున్న వేములూరు మనోజ్ రైఫిల్ షూటింగ్‌లో తన సత్తా చాటాడు. రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో హైదరాబాద్ గచ్చిబౌలిలోని సాట్స్ షూటింగ్ రేంజ్‌లో జూన్ 14 నుంచి 21వ తేదీ వరకు జరిగిన 23వ రాష్ట్ర స్థాయి రైఫిల్ షూటింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో 50 మీటర్ల ఓపెన్ సైట్ ప్రోన్ పొజిషన్‌లో ప్రతిభ చాటి సిల్వర్ పతకం సాధించాడు. విజయవాడ లెమన్‌ట్రీ ప్రీమియర్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైఫిల్ అసోసియేషన్ అధ్యక్షుడు సలాలిత్ తొట్టెంపూడి, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ చేతుల మీదుగా సిల్వర్ మెడల్ అందుకున్నారు.

మెకానిక్‌లు ఐక్యంగా ఉండాలి



మెకానిక్‌లను సన్మానించిన దృశ్యం

గంపలగూడెం: ద్విచక్ర వాహనాల మెకానిక్‌లు తమ సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా మెలగాలని నవ్యాంధ్ర టూవీలర్ మెకానిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ సుభాని తెలిపారు. గంపలగూడెంలో ఆదివారం నిర్వహించిన టూవీలర్స్ అసోసియేషన్ మండల శాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో మెకానిక్‌లు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. సమావేశంలో సీనియర్ మెకానిక్‌లు లక్కిరెడ్డి బాబుల్‌రెడ్డి, బూరుగు నారాయణను సన్మానించారు. నాయకులు సాంబశివరావు, బహుదూర్ ఖాన్, గంపలగూడెం శాఖ అధ్యక్షుడు శివరామాచారి, గౌరవాధ్యక్షుడు సీహెచ్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అంబటి మృతి తీరని లోటు



ఆంజనేయులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏపీయూడబ్ల్యూజే నాయకులు

మైలవరం: ఐజేయూ నాయకుడు అంబటి ఆంజనేయులు మృతి జర్నలిస్టులకు తీరని లోటు అని ఏపీయూడబ్ల్యూజే ఉమ్మడి కృష్ణా జిల్లా అధ్యక్షుడు యూ. వెంకట్రావు తెలిపారు. మైలవరంలోని ప్రెస్ క్లబ్ కార్యాలయంలో అంబటి ఆంజనేయులు సంస్మరణ సభ ఆదివారం నిర్వహించారు. ఆంజనేయులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు పీ మురళీబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే నాయకులు వెంకట్రావు, ఏపీ మీడియా ప్రొఫెషనల్ అసోసియేషన్ ఎన్టీఆర్ జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు పసుపులేటి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురిపై కేసు నమోదు

నూజివీడు: మండలంలోని పలు ప్రాంతాల్లో శనివారం రాత్రి రూరల్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించి ఐదుగురు వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ తలారి రామకృష్ణ తెలిపారు. నూజివీడు-హనుమాన్ జంక్షన్ రోడ్డులో రోడ్డు ప్రమాదాల నివారణకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. దీనిలో పట్టుబడిన వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు.